క్లుప్తంగా

ఇజ్జువరంలో కాఫీవిత్ క్లాప్‌మిత్ర



సంతబొమ్మాళి: పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కాఫీ తాగుతున్న అధికారులు

సంతబొమ్మాళి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమాన్ని ఇజ్జువరం గ్రామ పంచాయతీలోని చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద అధికారులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రేమలీల అధ్యక్షతన స్థానిక సర్పంచ్ బొడ్డేపల్లి లావణ్య ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. వాళ్లతో కలిసి కాఫీ తాగారు. గ్రామాభివృద్ధిలో వీరి పాత్రను కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉమాపతి, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చరిత్రను తెలుసుకోవాలి



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

టెక్కలి: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పురాతన కట్టడాల చరిత్రను తెలుసుకోవాలని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు అన్నారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా బుధవారం కళాశాలలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నో పర్యాటక కేంద్రాలు ఉన్నాయని వాటిపై అధ్యయనం చేసి చరిత్రను తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పర్యాటక రంగాన్ని కాపాడుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎ స్.శ్రీనివాసరావు, టూరిజం క్లబ్ కోఆర్డినేటర్ ఎస్.భాస్కర్‌బాబు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు శుభరాట



శుభరాట వేస్తున్న కమిటీ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను స్థానిక గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఇందులో భాగంగా శుభరాట వేసే కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా బుధవారం చేపట్టారు. ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తొలుత స్వేచ్ఛావతి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి శుభరాట వేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. అక్టోబర్ 15వ తేదీ నుంచి అమ్మవారికి ప్రత్యేక ఆలంకరణ చేసి నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

కంచిలి: నువాగడ పంచాయతీ పరిధి దొలాయిసాయి గిరిజన గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో మూడు పూరిళ్లు కాలిపోయాయి. దీంతో అగ్ని ప్రమాద బాధితులకు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అండగా నిలిచింది. ఇళ్ల నిర్మాణం కోసం 15 సిమెంటు రేకులు, సీతయ్య ఫౌండేషన్ వారు దుప్పట్లు, ఎస్.ఎం.ఎస్. సంస్థ తొమ్మిది సిమెంటు రేకులను బుధవారం అందజేశారు. ఆయా సంఘాల ప్రతినిధులు, సభ్యులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

ఇచ్ఛాపురం: పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ బుధవారం పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 295 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. వీటిలో 6, 35, 37, 120 నంబర్ల కేంద్రాల్లో 1400 మందికిపైగా ఓటర్లు ఉన్నారన్నారు. దీంతో కొత్తగా నాలుగు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఎలక్షన్ కమిషన్‌కి ప్రతిపాదనలు పంపించగా ఆమోదడం లభించిందన్నారు. దీంతో కేంద్రాల సంఖ్య 299కు చేరిందన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి

ఇచ్ఛాపురం రూరల్: మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని డ్వామా పీడీ జీవి చిట్టిరాజు సిబ్బందిని ఆదేశించారు. కేశవపురం, పాయితారి గ్రామాల్లో నాటిన పండ్ల మొక్కలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు అంతర పంటలు వేసుకోవడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. నాటిన ప్రతి మొక్క బతికే విధంగా సంరక్షణ చేపట్టాలన్నారు. కేశుపురం పంచాయతీలో అమృత సరోవర్ చెరువు అభివృద్ధిని పరిశీలించారు.

పంట నమోదు వేగవంతం చేయాలి

- 30వ తేదీతో ముగియనున్న ప్రక్రియ
- జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్




వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు (ఇన్‌సెట్లో) ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న శ్రీధర్

సోంపేట: ఖరీఫ్ పంటల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి కోటగిరి శ్రీధర్ సిబ్బందికి సూచించారు. ఈ నెల 30వ తేదీతో ఈ ప్రక్రియ ముగిస్తోందన్నారు. బేసిరామచంద్రాపురం, పాలవలస గ్రామాల్లో ఈ-పంట నమోదు ప్రక్రియను, వరి పొలాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలస్యంగా వరి నాట్లు వేస్తున్న కారణంగా ఇదివరకు ఈ-క్రాప్ నమోదు చేసుకోని రైతులు తక్షణమే నమోదు చేయించుకోవాలని సూచించారు. అక్టోబర్ మొదటి వారంలో రైతు భరోసా కేంద్రాల ఆవరణలో పంటనమోదు వివరాలను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శిస్తామన్నారు. రైతులు తమవివరాలు సరిదిద్దు కోవచ్చుననన్నారు. సోంపేట వ్యవసాయ సహాయసంచాలకులు కె.జగన్మోహనరావు, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి, వ్యవసాయ సహాయకులు ధనలక్ష్మి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

- ఎస్పీ జి.ఆర్.రాధిక



జాతీయ రహదారిపై పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ రాధిక

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన ఇచ్ఛాపురంలో శాంతిభద్రతలపై పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేక దృష్టిని సారించాలని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక సూచించారు. బుధవారం ఆమె స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో రికార్డుల నిర్వాహణ తీరును పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలన్నారు. సరిహద్దు గ్రామాల్లో నిఘా పెంచి అక్రమంగా తరలిస్తున్న గంజాయి, సారా వంటి మత్తు పదార్థాల అక్రమం రవాణాను అరికట్టేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసులు సమన్వయంతో నిరంతరం వాహనాలను తనిఖీలు చేయాలన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, సీఐ ఈశ్వరచంద్రప్రసాద్, ఎస్సైలు రమేష్, గోవిందరావులతో కలసి స్థానిక 16వ నంబర్ జాతీయ రహదారి, చెక్‌గేట్‌లను తనిఖీ చేశారు.

సీటి స్కాన్ సేవలకు అంతరాయం

టెక్కలి రూరల్: టెక్కలి జిల్లా ఆస్పత్రిలోని సీటి స్కాన్ సేవలకు అంతరాయం ఏర్పడినట్లు సిబ్బంది తెలిపారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు కారణంగా సిటీస్కాన్ మిషన్ బుధవారం పాడైంది. వెంటనే ఇంజినీరింగ్ అధికారులు వచ్చి పరిశీలించారు. బాగు చేసేందుకు రెండు రోజులు సమయం పడుతోందని.. రోగులు సహకరించాలని వైద్య సిబ్బంది కోరారు.

కథలతో సృజనాత్మక బోధన

కంచిలి: కథల ద్వారా విద్యార్థులకు సృజనాత్మకంగా బోధన చేయవచ్చునని డిప్యూటీ ఈవో పగడాలమ్మ అన్నారు. పెద్దశ్రీరాంపురం పాఠశాల సముదాయం సమావేశంలో బుధవారం ఆమె పాల్గొన్నారు. పక్షులు, జంతువులు, రాజుల కథల ద్వారానే విద్యార్థికి నీతి సందేశం వెళుతోందన్నారు. ఇచ్ఛాపురం, కంచిలి మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సిబ్బందికి శిక్షణ సామగ్రిని అందజేశారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ పద్మావతి, ఉపాధ్యాయులు వెంకటరావు, నిరంజన్ ఖడంగా, నాగేశ్వరరావు, సుజాత ఉన్నారు.

మెరుగైన సేవలందించాలి: జెడ్పీ సీఈవో



మాట్లాడుతున్న వెంకట్రామన్

కంచిలి: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని జెడ్పీ సీఈవో ఆర్.వెంకట్రామన్ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయ కార్యదర్శులు, ఉద్యోగులతో ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఇందులో సచివాలయాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, ఆధార్ సేవలు, వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు. త్వరలో మండలంలో నిర్వహించబోయే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సమావేశంలో సచివాలయ విభాగం నోడల్ ఆఫీసర్ వాసుదేవరావు, డీఎల్‌డీవో అలివేలు మంగమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 18వవార్డు రోటరీనగర్ నుంచి రూపావతి ఇంటివరకు సీసీ రోడ్డుకు శంకుస్థాపన కార్యక్రమం బుధవారం ఉదయం జరిగింది. మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు భూమిపూజ చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 4 లక్షలతో పనులు చేపట్టనున్నారు. వార్డు కౌన్సిలర్ సనపల సింహాచలం, 20వవార్డు ఇన్‌చార్జి అంబటి ఆనందరావు, పైల సూర్యం, సంపతిరావు జయంత్, లక్కోజి ధర్మారావు, కమీషనర్ నాగేంద్రకుమార్, ఏఈ అవినాష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల పరిశీలన



భవనాలను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

పలాస: అల్లుకోల గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్, సచివాలయం భవనాలను పలాస ఎంపీపీ ఉంగ ప్రవీణ, గ్రామ సర్పంచ్ దువ్వాడ వామాక్షి తదితరులు బుధవారం పరిశీలించారు. ఈ భవనాలను ఈ నెల 30వ తేదీన మంత్రి సీదిరి అప్పలరాజు ప్రారంభించనున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పంచాయతీ స్థాయిలో ప్రజలకు కావలిసిన అన్ని సదుపాయాలను ఏకకాలంలో అందించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ భవనాలను వినియోగంలోకి తీసుకొస్తామని సచివాలయ మండల కన్వీనరు దువ్వా రవి చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు, ఈవోపీఆర్డీ మెట్ట వైకుంఠరావు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

కవిటి: పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ అన్నారు. సహలాలపుట్టుగలో బెలగాం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.కవిటి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష సర్వేను బుధవారం చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రవి, బడ్డాయి మురళి ఉన్నారు.

ఎలమంచిలిలో పశువైద్య శిబిరం

కోటబొమ్మాళి: ఎలమంచిలి గ్రామంలో కోటబొమ్మాళి వెటర్నరీ ఏడీ మంద లోకనాథం ఆధ్వర్యంలో మెగా పశువైద్య శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. జిల్లా రైతు సమాఖ్య అధ్యక్షుడు కవిటి రామరాజు శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం జగనన్న పశుబీమా కార్డులను పాడి రైతులకు అందజేశారు. సర్పంచ్ కె.అమ్ములమ్మ, కురుడు, నిమ్మాడ పశువైద్యులు ఎల్.కిరణ్‌కుమార్, వెంకటేష్, వెటర్నరీ అసిస్టెంట్లు టి.శాంతారావు, వి.భానోజీ రావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయండి

- డీఈవో వెంకటేశ్వరరావు



సిబ్బందితో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వరరావు

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పడిన ఉపాధ్యాయుల కొరతను వెంటనే సర్దుబాటు చేయడం ద్వారా పరిష్కరించాలని మండల విద్యాశాఖాధికారి కె.అప్పారావుకి జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు సూచించారు. పాఠశాలను బుధవారం సందర్శించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న అసెంబ్లీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన బదిలీల కారణంగా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందని హెచ్ఎం ఎన్.విశ్వనాథం, సిబ్బంది డీఈవో దృష్టికి తీసుకెళ్లగా .. స్పందించిన ఆయన తక్షణమే ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఎంఈవోను ఆదేశించారు.

చెరువులో శ్రమదానం

పలాస: బ్రాహ్మణతర్లాలోని మంచినీటి కోనేటిని గ్రామస్తులు శ్రమదానం ద్వారా బుధవారం శుభ్రం చేశారు. చెత్తచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలాస పీఏసీఎస్ అధ్యక్షుడు పైల చిట్టిబాబు మాట్లాడుతూ.. చెరువులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు బాడాన పుష్ప, రమణమ్మ, రామారావు, దంతం వైకుంఠరావు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన సాయిరాజ్



సీఎం జగన్‌తో మాట్లాడుతున్న సాయిరాజ్

కంచిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ బుధవారం అమరావతిలో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ముఖ్యమైన సమస్యల్ని ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సిందిగా కోరారు. బెంతొరియా సామాజిక వర్గానికి సంబంధించి సత్వరమే ఎస్టీ స్టేటస్‌పై అనుకూల చర్యలు తీసుకుని వారికి న్యాయం చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని, సోంపేట మండలం బీల ప్రాంతంలో థర్మల్ పవర్‌ప్లాంట్ ఉద్యమకారులు 725 మందిపై ఉన్న కేసులను ఎత్తివేయాలని, సోంపేట మండలం బీల ప్రాంతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో జారీ చేసిన జీవోఎంఎస్ నంబర్ 329 ద్వారా సంక్రమించిన చేపల చెరువులు, వాటి గట్లను తొలగించేందుకు తగిన రద్దు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. వీటిపై సీఎం జగన్ సానుకూలంగా స్పందించారని.. సీఎం కార్యదర్శి ధనుంజయరెడ్డికి తదుపరి చర్యలు చేపట్టాల్సిందిగా సూచించినట్లు సాయిరాజ్ తెలిపారు.

మునగ నర్సరీ పరిశీలన

కవిటి: ఉపాధిహామీ పథకంలో ఉద్దానంలో ప్రారంభించిన మునగపంటసాగుకు సంబంధించి అమలు తీరును జిల్లా నీటియాజమాన్యసంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ చిట్టిరాజు బుధవారం పరిశీలించారు. కపాసుకుద్ది పంచాయితీలో ఈ పథకానికి అవసరమైన మొక్కల తయారీకేంద్రం (నర్సరీ)ని ఆయన తనిఖీ చేశారు. దీంతో పాటు నెలవంక గ్రామసచివాలయంలో ఉపాధిహామీ నిధులతో నిర్మిస్తున్న నిర్మాణాన్ని పరిశీలించారు. ఇందుకు సంబంధించిన వివరాల్ని స్థానిక ఏపీవో కడియం భాస్కరరావును అడిగి తెలుసుకున్నారు. ఏపీడీ అమ్మినాయుడు ఉన్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి ‘మూలపేట’ సమస్యలు



సీఎం జగన్‌కు సమస్యలను విన్నవిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ, ఆర్‌అండ్‌ఆర్ కమిటీ సభ్యులు

టెక్కలి: సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు నిర్వాసితుల సమస్యలను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌తో పాటు ఆర్‌అండ్‌ఆర్ కమిటీ సభ్యులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు బుధవారం అసెంబ్లీ ఆవరణలో సీఎంను మర్యాద పూర్వకంగా కలిశారు. మూలపేట నిర్వాసితులకు సంబంధించి తొమ్మిది సమస్యలను లిఖిత పూర్వకంగా సీఎం జగన్‌కు అందజేశారు. ప్రస్తుతం కేటాయించిన పోర్ట్ నిర్వాసితుల కాలనీ స్థలంలో మంచినీటి సదుపాయం కల్పించాలని, మూలపేట, విష్ణుచక్రం పోర్టు నిర్వాసిత గ్రామాల నుంచి సుమారు 18 మందికి వివిధ సాంకేతిక కారణాలతో అందని పీడీఎఫ్ ప్యాకేజీ అందేవిధంగా చూడాలని, 2022 ఏప్రిల్ 13వ తేదీ నాటికి సుమారు ఒకటి నుంచి ఆరు నెలల వయస్సు తక్కువ ఉన్న 18 మందికి వయసు సడలింపుతో యూత్ ప్యాకేజీ అందజేయాలని, 18 ఏళ్లలోపు వయసు కలిగిన యువతకు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా రూ. 5 లక్షలు వరకు అందజేయాలని విన్నవించారు. అలాగే యువతకు కటాఫ్ తేదీ ప్రకారం కాకుండా పోర్టు శంకుస్థాపన చేసిన తేదీ ప్రకారం ప్యాకేజీ ఇవ్వాలని, పోర్టు నిర్మాణం తరువాత ప్రతీ నిర్వాసిత కుటుంబానికి ఒక శాశ్వత ఉద్యోగం ఇవ్వాలని, వీటితో పాటు నిర్వాసిత కుటుంబానికి శాశ్వత ఉద్యోగావకాశం కోసం ఎంప్లాయిమెంట్-ఆర్ నంబర్ కలిగిన కార్డు ఇప్పించాలని, గ్రామకంఠం భూ ములకు సర్వే నిర్వహించి అనుభవదారులకు ఆర్ అండ్‌ఆర్ నష్ట పరిహారం ఇప్పించాలని, నిర్వాసితుల ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందజేయాలని విన్నవించారు. సీఎం జగన్ సానుకూలంగా స్పందించినట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి



సమస్యలను కలెక్టర్‌కి వివరిస్తున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: పురపాలక సంఘం పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కి వినతిపత్రం అందజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుతాం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కొటేరుబంద చెరువు ఆక్రమణకు గురైందని, ఏఐఐబీ ప్రాజక్టు పనులు వెంటనే పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని, జాతీయ రహదారి నుంచి బెల్లుపడ గ్రామంలోకి భారీ వాహనాలు రాకుండా చూడాలని, జగనన్న కాలనీలకు సంబంధించి.. లేఅవుట్లు కోర్టులో ఉన్నవాటి స్థానంలో కొత్త లేఅవుట్లకు స్థల సేకరణ చేయాలని, పురుషోత్తపురంలో బృందావన్ కాలనీలో విద్యుత్ సదుపాయం కల్పించాలని చైర్‌పర్సన్ విజ్ఞప్తి చేశారు. అలాగే పట్టణంలో నిరుపయోగంలో ఉన్న భవనాలను ప్రభుత్వ కార్యాకలాపాలకు ఉపయోగపడేలా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య కలెక్టర్‌ను కోరారు.

కవిటి సీహెచ్‌సీకి ఇద్దరు వైద్యుల నియామకం



సురేష్‌కుమార్



సాయిప్రసన్నకుమార్

కవిటి: మండల కేంద్రం కవిటి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసిందని సూపరింటెండెంట్ డాక్టర్ పి.రామ్‌జీ బుధవారం తెలిపారు. రెగ్యులర్ ప్రాతిపదికన చిన్నపిల్లల వైద్యనిపుణులుగా డాక్టర్ బాలక సురేష్, కాంట్రాక్ట్ విధానంలో జనరల్ సర్జన్‌గా ఎం.సాయిప్రసన్న కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రస్తుతం ఇక్కడ ఆరుగురు వైద్యులు సేవలందిస్తున్నారు. ఇప్పటివరకు మంజూరైన జనరల్ మెడిసన్ వైద్యుని పోస్టుకు అదనంగా ఈ రెండు స్పెషలిస్ట్ పోస్టులను ప్రభుత్వం నియమించడం ఉద్దానం ప్రాంతానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



షటిల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన కవిటి విద్యార్థులు



కవిటి: స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన ఇద్దివానిపాలెం విద్యార్థులు



కాశీబుగ్గ: రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు



కాశీబుగ్గ: విద్యార్థిని యామినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జవహార్



ఇచ్ఛాపురం రూరల్: యోగీశ్వరిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు



టెక్కలి: రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు



సంతబొమ్మాళి: విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, పీఈటీ, తదితరులు

కవిటి:జిల్లాస్థాయిలో ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా రాణించాలని హెచ్ఎంలు ఆర్.ఎస్.ఎం.తనూజ, బెందాళం మల్లేశ్వరరావు ఆకాంక్షించారు. ఈమేరకు బుధవారం జెడ్పీహెచ్ఎస్ ఇద్దివానిపాలెం, కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్రపోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. స్విమ్మింగ్‌లో ఇద్దివానిపాలెం నుంచి వారధి ఉపేంద్రవర్మ (100 మీటర్లు), జోగి మహేంద్ర (200 మీటర్లు), వంక జగదీష్(400 మీటర్లు) ఎంపికయ్యారని పీడీ షేక్ ఫాతిమా బేగం, ఆర్‌వీఎం పీఈటీ బి.లోకనాథం తెలిపారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి బి.పి.మణికంఠ, ఎస్.తరుణ్‌కుమార్ షటిల్‌బ్యాడ్మింటన్‌కు ఎంపికైనట్టు పీడీ జి.ప్రకాష్ తెలిపారు. విద్యార్థులను, శిక్షకులను గ్రామస్తులు, పాఠశాలల సిబ్బంది బుధవారం అభినందించారు.

యోగా పోటీలకు పలాస విద్యార్థులు

కాశీబుగ్గ: రాష్ట్రస్థాయి యోగా పోటీలకు రామక్రిష్ణాపురం ప్రాంతానికి చెందిన తొమ్మిది మంది విద్యార్థులు అర్హత సాధించారు. శ్రీకాకుళంలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు అండర్-14 విభాగంలో.. ఎస్.ఆశీష్, ఎం.జశ్వంత్, టి.ఉల్లాస్, టి.ప్రవీణ్ సాహూ, పి.ఎదువంశీ, జి.దీక్షిత్, కె.దివ్యశ్రీ, ఇ.చరణ్, టి.జానకీరామ్ ప్రతిభకనబర్చడం ద్వారా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను విద్యావిహార్ ఉపాధ్యాయులు అభినందించారు.

యోగేశ్వరికి కాంస్య పతకం

ఇచ్ఛాపురం రూరల్: గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 21, 22, 23 తేదీల్లో జరిగిన 34వ అంతర జిల్లాల రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఇచ్ఛాపురం మండలం డొంకూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని డి.యోగేశ్వరి కాంస్య పతకాన్ని సాధించింది. అండర్ 18 విభాగంలో 1.30 మీటర్ల హైజంప్‌లో ఈ పతకాన్ని దక్కించుకుంది. ప్రధానోపాధ్యాయురాలు జె.సరోజినీ ఆధ్వర్యంలో విజేతను ఉపాధ్యాయులు అభినందించారు.

పరుగు పోటీలో యామిని ప్రతిభ

కాశీబుగ్గ: రాష్ట్రస్థాయి పరుగు పోటీలో పలాస ప్రభుత్వ ఐటీఐ విద్యార్థిని అడప యామిని విశేష ప్రతిభ కనబర్చింది. మూడు విభాగాల్లో ప్రథమస్థానంలో నిలిచి సత్తాచాటడం ద్వారా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి సౌత్ జోన్ క్రీడల్లో పదివేల మీటర్ల పరుగు పోటీలో ప్రథమస్థానంలో నిలిచిన యామిని.. మూడు వేలు, ఐదు వేల మీటర్ల విభాగంగాలో కూడా మొదటిస్థానంలో నిలిచినట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ పైల జవహర్ బుధవారం చెప్పారు.

యామిని తల్లిదండ్రులు కూర్మారావు, శకుంతల కార్మికులు. పీఈటీ రామారావు శిక్షణలో విశేష ప్రతిభకనబర్చిన యామిని అక్టోబర్ 15 నుంచి 17వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి క్రీడలకు కూడా ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ చెప్పారు. ఆమెను అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తైక్వాండో క్రీడాకారులు

టెక్కలి: టెక్కలి క్రీడా వికాస కేంద్రానికి చెందిన తైక్వాండో విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్‌లు ఎస్.శేఖర్, సురేష్ బుధవారం తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన తాస్వి కృష్ణసామి, ఎం.తపస్వీ, ఎల్.జితేంద్ర, ఐ.కార్తీక్, ఎస్.గణేష్లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

నౌపడ విద్యార్థులు

సంతబొమ్మాళి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపిక పోటీల్లో నౌపడ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిబకనబర్చారు. అండర్-17 విభాగంలో ఎం.బాలభార్గవ్, అండర్-14 విభాగంలో చిదపాన గౌరీ స్వరూప్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు ప్రధాన ఉపాధ్యాయుడు ఎం.భానుప్రకాష్, పీఈటీ శ్యామ్ బుధవారం తెలిపా రు. ఈ నెల 25వ తేదీన శ్రీకాకుళంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను పాఠశాలలో ఏర్పాటు చేసిన కా ర్యక్రమంలో ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమి టీ చైర్మన్ పి.కోటేశ్వరరావు అభినందించారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి



కాశీబుగ్గ: పోషక పదార్థాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని వక్తలు అన్నారు. పలాస రైల్వేకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, వాయిలాపల్లి లక్ష్మణరావులు పోషణ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోషణ పక్వాడ్ పేరుతో ఏర్పాటు చేసిన పూలఅలంకరణ అందరినీ ఆకట్టుకున్నాయి. కాశీబుగ్గ సెక్టార్ సూపర్‌వైజర్ పి.సునీత పాల్గొన్నారు.

సోంపేట: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బెందాళం వెంకటరమణ అన్నారు. సోంపేట పట్టణంలోని రెండో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీవో చింతాడ ఇందిర, ఏసీడీపీవో కె.గోవింద రాజులమ్మ, సర్పంచ్ నగిరి ప్రభావతి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని కాశీబుగ్గ సీడీపీవో శార్వాణి అన్నారు. అనంతగిరి ఐసీడీఎస్ సెక్టార్‌లో బుధవారం పోషణ మాసోత్సవాలను నిర్వహించారు.